
గొంగళీ పురుగులు సీతాకోక చిలక లవుతాయిట. అది కీటక ప్రపంచంలో జరిగే వింతకాని, మానవ జీవితంలోతరుచుగా సీతాకోక చిలకలు గొంగళీ పురుగు లవుతాయని అనుకున్నాడు విశ్వం.

# ఇచ్ఛాపురపు జగన్నాథరావు



పది నిమిషాలనించి ఆగకుండా ఉపన్యసిస్తోంది అతని భార్య జానకి. ఇద్దరూ ఉదయం ఆలస్యంగా లేచేరు. ఆదివారం కనక అది మామూలే. కాని విశ్వం ఆమెకన్నా అరగంట ముందుగా లేచి టీ పెట్టుకుని తాగి పేపరుచూస్తూ సిగరెట్ వెలిగించడంతో జానకికి తెలివివొచ్చింది.

"ఆ పాడు సిగరెట్ నా నిద్ర పాడుచేసింది. పొద్దుటే అది తగలెయ్యకపోతేనేం?" అంది జానకి విసుక్కుంటూ.



# వేట

"ఎవరయ్యా బాబూ
ఎవరి కోసం వెదుకుతున్నారు ?
ఏ వూరు ? ఏ వీధి ?
ఏ యిల్లు ?"

"బాబయ్యా! మీరూ పదండి
దారి కాసి పట్టుకోండి
సందు దొరికితే
జారి పోదామనుకుంటాడు.
పక్కన ఎవరో ఎప్పుడూ
పట్టుకుని వుండాలి
పలాయన వాది-
స్వార్థపరుడు-
ఆశ్రిత పక్షపాతి-
యాచకుడు. అరాచకుడు-
భక్తుడు- రక్తుడు- విరక్తుడు-
రంగులు మారుస్తూంటాడు
జ్ఞాన స్నానం చేయించాలి
సంఘ జీవిగా బతకవలసిన వాడు
పేరేమో మానవుడు-"

భిన్న విశ్వాసాల
సమూహ సంప్రదాయాలు
ప్రవాహ వాహనం మీద
వాడికోసం వేటకు బయలుదేరాయి.

* * *

వేగం, వైశాల్యం, కుదిరినప్పుడు
కెరటాలై లేస్తుంది ప్రవాహం.
కసిగా సుడులు తిరిగినప్పుడు
నినదిస్తుంది అహరహం.
పొరలు పొరలుగా తరగ విడి
చొక్కాలు, పంచెలు, పంట్లాములు,
సిద్ధాంతాలు, ధరించి-
అరదండాలు, దండాలు,
వహించింది-
అయితే-
మాయమయ్యాడా, నేడు
మానవుడు !-

జీవనరథ్యలో నిలబడి
చుట్టూ చూడు
క్షణ క్షణిక వేగానంత
దృశ్య శకలాలు....
ఆకర్షించేవి- వికర్షించేవి-

వినిపిస్తున్నాయి పిలుపులు-
మా ఇజం నిజం-
మా భజన పాళీ గట్టిది-
మా విపణిక్షోణీ వక్షోజతల్పం
అనల్పం-
మా మృదుల మాధ్వీక గృహాంతరం
మంచి రక్షణ....

బొంగరం లాగ- గిరగిర
మెడ తిప్పినా
చూడ శక్యం కావి
ఆహ్వాన నేత్రతోరణాలు-
తలెత్తి చూశావో,
అరవై కోట్ల జనం తలల మీద
అక్షయ భిక్షా పాత్ర- ఆకలి పందిరి-

* * *

ఇది మబ్బులు పట్టిన వేళ
ఈ జటిల ఘటా జటా కటాహంలో
దుఃఖ జలధారల్లో
గజగజ వణికే
ఒంటరి జాబిల్లి- మానవుడు.

నేనెరుగుదును
వాడు విడిగా కనిపించే బిందువు
తన తలలో ఎప్పుడూ
ఘూర్ణిల్లుతుందొక సింధువు.
తనకి తనొక్కడే
ఏ కొంత బంధువు.
ఇంకా బతికే వున్నాడు.
సమూహం పేరు చెపుతూ
తన్ను తాను వంచించుకునే
మనిషిని మించిన మాదచోద్
మరి వుండదని గుర్తించాడు.

తనకు కావలసిన
శాంతి కోసం, కాంతి కోసం,
జన ధనుస్సు నుంచి
స్వచ్ఛందంగా దూసుకుపోయిన
మనోంబకం- వాడు.
మృత సంజీవని విన్న
కచుడిలాగ
నీ శుక్రగర్భం చీల్చుకుని
నీలోంచే ఎప్పుడో
బయటకు రావచ్చు.
వేచి చూడు-
మరింక వెదకొద్దు.

—ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

నిజానికి విశ్వం బాల్కనీలో కూర్చుని ఉన్నాడు. గాలివాటుకి సిగరెట్ పొగ అటు నేపు పోయిందని అతనికి తెలీదు. తెలిసినా అతను చేసేదేమీలేదు. జీవితంలో మిగిలిన కొద్ది ఆనందాలలో ఉదయం టీ తాగి సిగరెట్ వెలిగించడం ఒకటి!

విశ్వం ఆమెకి జవాబివ్వలేదు.

పెళ్ళికి ముందర ఆమెతో ప్రేమాయణంలో మొదటి దశ అతనికి జ్ఞాపకం వొచ్చింది. తన సిగరెట్ వెలిగించడం ఆమెకి ఒక సరదా. అలాగ ఆమె వెలిగిస్తోంటే అతనికొక ఆనందం. సిగరెట్ పొగ ఆమెకి బాధ కలిగిస్తుందని విశ్వం మొదట సంశయిస్తే, "డోంట్ వర్రీ ! మా ఫాదర్, బ్రదర్ - ఇద్దరూ సిగరెట్లు తాగేవాళ్ళే. మా అంకుల్‌లాగ చుట్టలు మాత్రం కాల్చవొద్దు. ఆ వాసనమాత్రం భరించలేను" అంది జానకి.

ఆ సరదాలూ, అందాలూ పోయి కొంతకాలం అయింది.

ఆమెకి సిగరెట్ మీద ప్రత్యేకమైన ద్వేషమేమీ లేదని విశ్వానికి తెలుసును. వాళ్ళ లేడీస్ క్లబ్‌లో చాలామంది సిగరెట్లు కాలుస్తారని ఆమె చెప్పింది. ఎటొచ్చీ తను కాలిస్తేనే ఆమెకి కోపం.

"మీకు స్వార్థం మరీ ఎక్కువైపోయింది" అంది జానకి ముఖం కడుక్కుని వొచ్చి.

"ఇంకా తెల్లవారుతూనే వుంది. అప్పుడే ఏమయింది ?" అన్నాడు విశ్వం వారఫలాల పేజీ చూస్తూ. వీళ్ళేమిటి రాశారో మరునిమిషం జ్ఞాపకం వుండదు. కాని, విధిగా నాలుగైదు పత్రికలలో వారఫలాలు చూడడం అతనికో సరదా.

"మీ టీ మాట చూసుకున్నారు....కొంచెం ఫ్లాస్కులో పోసి ఉంచితే ఏం ?" అంది జానకి.

"పోసి ఉంచాను" అన్నాడు విశ్వం తల ఎత్తకుండా. పొద్దుటే చెదిరిపోయిన జుత్తు, నలిగిపోయిన నైట్ గౌనులో ఆమెని చూడాలని ఉండదతనికి. కలకలలాడుతూ, స్నానంచేసి శుచిగా తాజాగా ఆమె కనిపించాలని అతని కోరిక. కాని ఆ కోరిక బయటపెట్టడానికి కూడా వీల్లేదు. చివ్వున లేచి మురికినీళ్ళు దిమ్మరించినట్లు నోరు చేసుకుంటుంది జానకి. ఈ మధ్య మరీని.

"ఎక్కడ ?"

"కిచెన్‌లో పెట్టేను. ఎర్ర ఫ్లాస్కు చూడు".

"నీలం ఫ్లాస్కుమీద మీ కోపం తగ్గలేదన్నమాట."

విశ్వం ఏమీ అనలేదు. కాని జానకి మాటలో కొంత నిజం వుందని అనుకున్నాడు. ఆ ఫ్లాస్కు వెనకాల చిన్న చరిత్ర ఉంది. నెల రోజుల కిందట ఆ కాలనీలో వున్నవాళ్ళు ఒక వినోదయాత్ర వెళ్ళేరు. విశ్వం కూడా జానకి కోరికమీద వెడదామనే అన్నాడు. కాని చివరి నిమిషంలో కంపెనీ పనిమీద కలకత్తా వెళ్ళాల్సివొచ్చి మానేశాడు. జానకి వెళ్ళనని అనలేదు. అని వుంటే బాగుండేది. కనీసం, తన మాట మీద ఆమె వెళ్ళిందనే సంతృప్తి కోసం ఆమెని బలవంతంగానైనా పంపి ఉండేవాడు.

మూడు రోజుల తరవాత అతను తిరిగి వచ్చి, ఎంతో చక్కగా ఉన్న ఆ ఫ్లాస్కు చూశాడు.

"కొన్నావా?" అన్నాడు. అప్పటికే తమ ఇంట్లో రెండు ఫ్లాస్కులు ఉన్నాయి.

"లేదు. నేను కాఫీతో పట్టికెళ్ళిన ఫ్లాస్కు గోపాల్ చేతిలో నించి జారిపడింది. అతనిది తెచ్చియిచ్చేడు అమెరికా నించి తెచ్చేడుట" అంది జానకి.

విశ్వానికి గోపాల్ అంటే మంచి అభిప్రాయం లేదు. ఆడ వాళ్ళతో అతి చనువు తీసుకోడం అతనికి అలవాటు. ఒకటి రెండు సార్లు జానకితోనూ అతి స్నేహంగా వుండడం గమనించడంకన్న ఏమీ చెయ్యలేకపోయాడు విశ్వం. ఏమాత్రం సూచనగానే అయినా మందలిస్తే జానకి తన మర్యాదని ఇంట్లోనూ, బయట కూడా తీసేస్తుంది. ఇలాటి పరిస్థితులు విపరీతంగా ఉంటాయి ! అనుమానంలో నిజం లేకపోతే ఆమెకి కోపం వొస్తుంది. నిజం వుంటే, ఇంకా ఎక్కువ కోపం వొస్తుంది.

ఆ పరిస్థితికి, తన నిస్సహాయతకి చిహ్నం ఆ బ్లూ ఫ్లాస్కు.

అందులో ఏది పోసినా విశ్వం తీసుకోలేదు. జానకి అది గమనించినా ఇవేళదాకా ఏమీ అనలేదు.

కప్‌లో టీ పోసి తెచ్చుకుని, "పంచదార మరీ తక్కువ" అంది.




"మరి కొంచెం వేసుకో" అన్నాడు విశ్వం.

"వేసుకున్నాను. కాని, తన రుచుల ప్రకారమే అవతలి వాళ్ళు ఉండాలని మీ మగవాళ్ళు ఎందుకనుకుంటారు ?" అంది జానకి.

దానికి జవాబు ఇవ్వదలుచుకోలేదు విశ్వం. తొలినాటి రాత్రి తియ్యగా గడిచిపోయాక మర్నాడు పుల్ల పుల్లగా మాటలాడడం ఆమె తత్వంగా అతను అర్థంచేసుకున్నాడు. జానకి చెడ్డది కాదు. కాని, తెలుపులో ఏడు రంగులు కలిసివున్నట్లు ఆమెలో నూ వున్నాయి. ఒక్కొక్క సమయంలో ఒక్కొక్కటి బయటికి వొస్తూ వుంటుంది. ఒకనాడు ఆమెకి, తనకి మధ్యన చాలా గాఢమైన ప్రణయం నడిచిందని అతను మరిచిపోలేదు. కొంచెం నెలలే అయినా ఆ రోజుల అతి మధురక్షణాలకి ఆమె కారకురాలనీ అతను మరిచిపోడు. అందుకే, మనసులో బాధపడినా దాన్ని తుడిచేసుకుని నిర్వికారంగా ప్రవర్తించే శక్తి అతనికి కలిగింది. పెళ్ళి దాకా జానకి సీతాకోకచిలక. ఆ తరువాత కలలు నిజాలకి, ఆశలు వాస్తవాలకి లొంగిపోయాక ఆమెలో కొన్ని మార్పులు రావడాన్ని విశ్వం అంగీకరించాడు. తనలోనూ అలాగే మార్పులు వచ్చాయని అతనికి తెలుసు. జానకిలో ఎక్కడో తనమీద అప్పటి మమతలో ఒక భాగమైనా వుందనీ అతనికి తెలుసును. అందుకే అతను ఆశలమేడ ఆరో అంతస్తులోనించి కింది గదుల్లోకి వొచ్చినా, ఈ చిన్న చిన్న బాధలని భరించగలుగుతున్నాడు. జానకి కూడా అంతేనని అతనికి తెలుసును. కాని, తమ దాంపత్యంలో మరి కొంచెం మాధుర్యం అతను కోరుకుంటూ ఆ ఆశనీ, అప్పటి జ్ఞాపకాలనీ పట్టుకుని జీవిస్తున్నాడు.

రెండో కప్ టీ తాగడం ముగించింది జానకి.

"వంట మనిషి రాలేదు" అంది.

"హోటలుకి పోదాంలే" అన్నాడు విశ్వం. నిజానికి హోటల్ తిండికన్నా వంటమనిషి బాగా చేస్తుంది. ఆమెకన్నా జానకి మంచి వంట చేస్తుంది. కాని, వండమని అంటే ఆమెకి కోపం. బుద్ధి పుడితే ఒక్కొక్కరోజు అన్నీ తనే వండుతుంది.

"మీ గెస్టు ఎప్పుడొస్తారు? లంచ్‌కి పిలిచేరా?"

"పదికి వస్తారు. లంచ్‌కి ఉండమన్నాను. అతన్ని తీసుకుని పోదాం" అన్నాడు విశ్వం.

"ఎవరతను ?" అంది జానకి.

"మోహన్‌కుమార్.... స్టేట్ బేంక్‌లో ఆఫీసరు."

"మీ కెలాగ పరిచయం ?"

"మా ఫేక్టరీకి వొచ్చాడు ఏదో అకౌంట్స్ విషయం చర్చించడానికి.... చాలా స్మార్ట్ ఫెలో."

జానకి కొంచెంసేపు పేపరు చదివి కిందని పడేసి, "పెళ్ళి అయిందా ?" అంది.

"ఎవరికి ?" అన్నాడు విశ్వం పరధ్యానంగా.

"మోహన్ కుమార్‌కి...."

"లేదు."

"అంత చిన్నవాడా ?"

"ఇరవై ఆరో ఏడో ఉంటాయి. కాని, అతనసలు పెళ్ళి చేసుకోడుట."

"ఏం ? ఏదైనా లోపమా ?"

"కాదులే. పెళ్ళిచేసుకుంటే అన్నీ బాధలే అని అతనికి చాలా గట్టి నమ్మకం ! గంటలతరబడి చెప్తాడు."

"పెళ్ళికానివాళ్ళలాగే అంటారులెండి ! అది సీరియస్‌గా తీసుకోనక్కరలేదు."

"కుమార్ విషయంలో అలా అనిపించలేదు.... స్వంత తల్లిదండ్రులతోపాటు అతనికి తెలిసినవాళ్ళలో అన్నిచోట్లా తాను చూసినవీ, గ్రహించినవీ విషయాలు చెప్పి సుఖశాంతుల వినాశానికి పెళ్ళి మూలకారణం అని వాదిస్తాడు...."

"మీకు అది నచ్చివుంటుంది. అందుకే ఫ్రెండు అయాడు" అంది జానకి సర్రున నిర్వికారంగా కత్తితో కోసినట్టు.

"నీ యిష్టం వొచ్చినట్టు అనుకో జానకీ ! నిజం నీకూ తెలుసును" అన్నాడు వ్యథలేని గొంతుకతో విశ్వం. ఆమె ఎదురు మాటలు చెప్తుందని సిద్ధపడ్డాడు. కాని జానకి లోపలికి వెళ్ళిపోయింది ఏదో విషయంమీద వాదన మొదలుపెట్టి సాగించడం అలవాటైన జానకి అలాగ వూరుకోడం విశ్వానికి విచిత్రంగా వుంది.

మరో అరగంటదాకా ఏదో చదువుతూ కూర్చున్నాడు విశ్వం. తొమ్మిది అయింది. జానకివొచ్చి "వెళ్ళి స్నానంచేసి రండి" అంది.

"తొందర ఏముంది ? పదేకదా ?" అన్నాడు విశ్వం. జానకి చాలా మారిపోయింది. చక్కటి చీర కట్టుకుంది. లక్షణంగా

# శవపరీక్ష

పొట్టకోసి వెదికారు
కస్తూరి దొరకలేదు.
పొరలు పొరలుగా చర్మాన్ని వలిచారు
పసిడి రేకులు తగల్లేదు.
పేగుల్లో గాలించారు
మణి మాణిక్యాల జాడల్లేవు.
గుండెల్ని తరచి చూసారు
సూర్యవంశపు శౌర్యం జాడల్లేవు.
ధర్మాలుచేసి ఆర్జించిన పుణ్యామృత
భాండం
శరీరమంతా తీక్ష్ణంగా వెదికినా కాన
రాలేదు.
ముక్కలు ముక్కలుగా నరికిచూసినా
ఆత్మజ్ఞానపు జాడలు లీలగానైనా గోచ
రించలేదు.
కానీ....
ఉరఃపంజరంలో తోడేలు గుండె కని
పించింది.
వేలిగోళ్ళల్లో పులి పంజా ఛాయలు
దొరికాయి....
అందమైన పలువరుస మాటున రాక్షసి
కోరలు కనబడ్డాయి....
సనాతనత్వం జీర్ణించుకుపోయిన
నరాల్లో 'మందు' ఛాయలు దొరికాయి
అయ్యో ! ఇదంతే....
ఓ ఆర్యకుమారుని శవపరీక్ష ఫలితం.

ఆంగ్లమూలం: ఏరవ్ పచేరా. స్వేచ్ఛానువాదం: అమరేంద్ర. డి.

జడ వేసుకుంది. మామూలుగా అయితే ఇంట్లో పంట్లం వేసుకుని తిరుగుతూ ఉంటుంది. ఒకటి రెండుసార్లు విశ్వం విమర్శ విని ఆమె మండిపడింది ఆడవాళ్ళు తమ సౌకర్యానికీ, అభిరుచులకీ తగినట్టు బట్టలు వేసుకునే హక్కు ఉందని వాదించింది. మళ్ళీ ఆ విషయంలో విశ్వం నోరెత్తలేదు.

అతను లేచివెళ్ళేడు. సర్వెంటుచేత ఇల్లంతా శుభ్రం చేయిస్తోంది జానకి. ఇది మామూలుగా జరిగే పనికాదు. ఆ పనిమనిషి తనకి తోచినట్టు శుభ్రంచేసి కట్టినచీర నలగకుండా చూసుకుని వెళ్ళిపోతుంది. జానకి పట్టించుకోదు.

ఈ మార్పులన్నీ ఎందుకోనని ఆలోచించలేదు విశ్వం. తియ్యటి సన్నివేశాలు అనుభూతికోసమేగాని ఆలోచనలకోసం కాదని అతనికి తెలుసును. వెళ్ళి షేవ్‌చేసుకుని స్నానం చేసి బట్టలు వేసుకున్నాడు. మామూలుగా అయితే గళ్ళలుంగీ వేసుకునే వాడు. అది జానకికి పడదు. రెండుసార్లు అలాటి లుంగీలు ఎవ రెవరికో ధర్మం చేసింది. కాని మళ్ళీ సరిగ్గా అలాటివే కొని తెచ్చుకున్నాడు విశ్వం. చిటచిటలాడడం కన్న ఏమీ చెయ్యలేకపోయింది జానకి. ఏమనీ అంటే జవాబుగా తగిన మార్పులతో తన మాటలనే అతను అప్పగించుతాడని ఆమెకి తెలుసును.

తెల్లటి పంట్లం, షర్టు వేసుకున్నాడు.

జానకి కాఫీ తెచ్చి యిచ్చింది. లవ్‌లీగా వుంది, జానకి, కాఫీ రెండూను. వాటికన్నా ఆమె చిరునవ్వు బాగుంది.

కాఫీ తాగుతూ కంపెనీ కాగితాలు ముందు పడేసుకుని చూస్తూ కూర్చున్నాడు విశ్వం. ఇంట్లో యింత హాయిగా వుండడం చాలా కాలం తరవాత. ఇది యెంతకాలమో. యెందుకో అనవసరం

కాగితాలల్లో లీనమైపోయాడు. డోర్‌బెల్ విని తలఎత్తేడు. వెళ్ళి తలుపు తీసేసరికి మోహన్‌కుమార్ నవ్వుతూ నిలబడ్డాడు. అతని చేతిలో చక్కటి పువ్వులగుత్తి వుంది.

"రండి—మా ఇంటికి వొస్తానని వాగ్దానం చేశారు. మరిచిపోకుండా వొచ్చేరు. ధన్యవాదాలు" అంటూ అతన్ని ఆహ్వానించేడు విశ్వం. కుమార్ అంటే అతనికి అభిమానమూ గౌరవమూను అదృష్టంకొద్దీ ఈ రోజు జానకి మంచి మూడ్‌లో వుండడం అతనికి చాలా సంతోషంగా వుంది. లేకపోతే కుమార్ నమ్మకాలు మరింత గట్టిపడి వుండేవి. ఆమె మూడ్ చెడకుండా తామూ జాగ్రత్తగా వ్యవహరించాలని విశ్వం వొకసారి అనుకున్నాడు.

"నేను మాటతప్పని మనిషినని తెలుసుగా!....ఈ ఫ్లవర్స్ వాజ్‌లో పెట్టండి" అంటూ అతనికి యిచ్చియ్యబోయాడు కుమార్.

"థేంక్స్...." అంటూ అవి తీసుకుని, "జానకీ!" అని పిలిచాడు విశ్వం. నిమిషంలో వొచ్చిన జానకిని కుమార్‌కి పరిచయంచేసి, "చూడు! ఈ లవ్లీ ఫ్లవర్స్ తెచ్చాడీయన.... నీకు ఈ రోజెస్ ఇష్టమని ఎలాగ తెలిసిందో!" అంటూ ఆమెకి ఇచ్చాడు.

అతనికి థేంక్స్ చెప్పి, "నాకీ రోజెస్ ఇష్టమని మీరు చెప్పి ఉంటారు" అంది జానకి.

"లేదు...." అన్నాడు విశ్వం. జానకిమాటల్లో ఏదో లోతు ఉందనీ, అది తనకి తెలియలేదనీ అతను గ్రహించాడు.

"నిజానికి— ఆయన చెప్పలేదు. కాని, ఆయన మిమ్మల్ని గురించి చెప్పేక నేను గెస్‌చేశాను. అది నిజమయిందనుకుంటాను థేంక్స్!" అన్నాడు కుమార్.

"ఆయన చెప్పేవన్నీ నమ్మకండి! నన్ను ఆకాశానికి ఎత్తడం ఆయనకి చాలా అలవాటు. అవతలివాళ్ళు ఏమనుకుంటారోనని కూడా ఆలోచించరు" అంది వాళ్ళతోపాటు తానూ కూర్చుంటూ జానకి.

"విశ్వంగారు అబద్ధాలు చెప్పరులెండి. అయామ్ డిలైటెడ్



సీ యూ. నాలుగేళ్ళయి పెళ్ళిచేసుకుని కూడా మీరిద్దరూ ఇంత హేపీగా వున్నారంటే నాకు ఆశ్చర్యంకలుగుతూంది...." అన్నాడు కుమార్

"పెళ్ళి వైన్‌లాటిదండీ! పాతబడినకొద్దీ దాని విలువా, రుచీ ఎక్కువ అవుతాయి" అంది జానకి చిరునవ్వుతో విశ్వాన్ని చూస్తూ.

"నిజం చెప్పేవు జానకీ! అది పులిసిపోకుండా మాధుర్యాన్ని ఇచ్చేది స్త్రీ. భర్త కేవలం పీసాలాటివాడు" అన్నాడు విశ్వం.

"మీ ఇద్దరినీ చూస్తుంటే, మీ మాటలు వింటుంటే నాకు గుంచి వైన్ తాగుతూన్నట్టు వుంది" అన్నాడు కుమార్ జానకినీ, విశ్వాన్నీ మార్చి మార్చి చూస్తూ.

"థేంక్స్! మీ అంత విచక్షణా, ఆలోచనా వున్న మనిషికి తగిన భార్య దొరికితే జీవితం అమృతంలాగ ఉంటుంది! ఆ అమృతాన్ని రుచి చూడాలనివుంది. కాని, మీ భార్యని తీసుకుని రాలేదేం? ఆయన చెప్పలేదా?" అంది జానకి. విశ్వం తెల్లబోయాడు.

"నేను...." అని ఆగిపోయాడు.


"వొచ్చేవారం ఆవిడని కూడా తీసుకురండి. ఆయన వొట్టి పసివారు! లేకపోతే మిమ్మల్ని రమ్మని ఆమెని పిలవకుండా వుంటారా?" అంది జానకి.

"నాకు పెళ్ళికాలేదండీ! విశ్వంగారికి తెలుసును" అన్నాడు కుమార్ నవ్వుతూ.

"ఓ! అలాగా! మీ గురించి చాలా చాలా చెప్పేరుగాని, ఆ మాట చెప్పలేదు....అంటే ఎక్కడో ఒక అమ్మాయిని దూరంగా వుంచనిచ్చి బాధపెడుతున్నారన్నమాట.... ఎవరో తెలుసునా?" అంది జానకి చెరగని చిరునవ్వుతో.

"తెలీదండీ! అసలు నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు" అన్నాడు కుమార్. జానకి తేలిగ్గా నవ్వింది. "నేనూ అలాగే అనుకునేదాన్ని. ఆయన గారిమాట సరేసరి.... కాని, ఇప్పుడు యిద్దరమూ యేమనుకుంటామో తెలుసా?....అంతకాలం ఎందుకు వేస్ట్ చేశాం అని విచారిస్తాం...." అంది జానకి. విశ్వం ఒక చిరునవ్వుతో ఆమెవైపు చూశాడు.

"మీలాటి జంటలు ఎక్సెప్షన్ జానకిగారూ! కాని, పెళ్ళి అన్నది ప్రేమకీ, సంసారం అన్నది సుఖశాంతులకీ విఘ్నప్రాయం. నేను చాలా చూశాను" అన్నాడు కుమార్.




"అది మీ లాటివాళ్ళ విషయంలో నిజం కాదు. భార్యాభర్తలిద్దరూ మరీ మూర్ఖులయితే తప్ప అలాగ జరగదు .... ఆయన చూడండి! నేను ఎన్ని పొరపాట్లుచేసినా ఆ చిరునవ్వుతోనే క్షమిస్తారు...."

"అదేంకాదు కుమార్! మా జానకికి సహనం ఎక్కువ. అందుకే నేనేంచేసినా సహిస్తుంది. పూర్ గర్ల్!" అన్నాడు విశ్వం.

జానకి లేచింది.

"మా ఇద్దరి మాటలూ ఇలా సాగుతూంటే మీకు తలనొప్పిలెండి— నేను వంట చూసుకుంటాను. మీరు కబుర్లు చెప్పుకోండి" అంది వెళ్ళబోతూ.

"లంచ్‌కి హోటల్‌కి పోదామనుకున్నాంకదా జానకీ!" అన్నాడు విశ్వం.

"రాక రాక మీ ఫ్రెండ్ వొస్తే బయటికెందుకు పోవాలండీ! లేక నా వంట ఆయనకీ, మీకూ నచ్చదనుకుంటే మీరు చెప్పినట్టే చేద్దాము" అంది జానకి నిలబడి.

"నీ వంటకేం! తిని ఈ నాలుగు నెలలలోనే నాలుగు కిలోలు పెరిగేను. అదికాదు. వంటమనిషి లేదు కదా!" అన్నాడు విశ్వం.

"ఆ మాత్రం పనిలేకపోతే ఎలాగండీ! పదకొండున్నరకి అంతా రెడీ చేస్తాను. బయట చాలా ఎండగా వుంది. వెళ్ళి బీరు తెచ్చుకోకూడదూ?" అంది జానకి.

"అక్కరలేదండీ! — విశ్వంగారికి కావలిస్తే తప్ప" అన్నాడు కుమార్.

"నాకూ వొద్దు జానకీ" అన్నాడు విశ్వం.

"సరే. మంచి కొత్తిమిరి రసం పంపుతాను...." అంది జానకి. విశ్వం, కుమార్ కబుర్లలో పడ్డారు. కుమార్ మాటల్లో తమ సంసారం మీద వున్న సదుద్దేశం గమనించి విశ్వం చాలా గర్వపడ్డాడు.

ఆ సదుద్దేశం జానకి పెట్టిన భోజనం తరవాత చాలా బలపడింది. ఎప్పటికన్నా నేర్పుగా చేసిన వంటలు చాలా బాగున్నాయి. "నేను హోటల్ తిండి తినలేక స్వయంపాకం పెట్టుకున్నాను.... నేను వొండినది నాకు బాగానే వుంటుంది. కాని, మీ చేతి వొంట తిన్నాక ఆ పరిస్థితి మారిపోయేలాగ వుంది" అన్నాడు కుమార్ మనసారా.

"మీకు పొగడ్తలు బాగా వొచ్చును! వండినవన్నీ అలాగే వున్నాయి" అంది జానకి.

కుమార్ నవ్వుతూ అంతా తనకి తెలుసునన్నాడు. జానకి నమ్మలేకపోతే మళ్ళీ పిలిచి చూడమన్నాడు. అది ఆసరాగా తీసుకుని అతన్ని వొచ్చేవారం మూడురోజులూ తమ యింట్లో వుండమంది. ఆ మూడురోజులూ దసరాకి సెలవురోజులు.

మొదటిరోజు మాత్రం రావడానికి కుమార్ అంగీకరించేడు. రెండోరోజుకూడా వొచ్చేలాగ జానకి, విశ్వం వొప్పించేరు. మళ్ళీ మళ్ళీ ధన్యవాదాలు చెప్పి కుమార్ వెళ్ళిపోయాడు.

"థేంక్స్! అతను వొచ్చినందుకు వండ్రఫుల్‌గా చేశావు" అన్నాడు విశ్వం. జానకి ఏమీ అనలేదు. విశ్వం నిద్రపోయి ఆలస్యంగా లేచాడు. బయటికి వెళ్ళి తిరిగిరావాలని ఉంది అతనికి. తనకి అలసటగా ఉందని ఇంట్లోనే ఉండిపోయింది జానకి.

ఆ తరువాత మూడు నాలుగురోజులూ జానకిలో కొంత మార్పు కనిపించింది విశ్వానికి. ఆదివారంనాటి మాధుర్యం ఆమెలో కనిపించకపోయినా ఆ ముందరి పులుపు కూడా అంతగా కనిపించలేదు. గురువారం సాయంత్రం రాధ రావడంతో ఇంటి వాతావరణం మళ్ళీ మారింది.

రాధ జానకి పినతల్లిగారి అమ్మాయి. బి. ఏ. పాసయింది.

బాగా ఉంటుంది. కొంచెం నోటి దురుసు — తొందరపడే రకం. విశ్వానికి ఆమెమీద మంచి ఉద్దేశం లేదు. కాని, జానకికి ఆ పిల్ల అంటే చాలా అభిమానం.

"ఏమిటి రాధా ! హఠాత్తుగా వొచ్చావు ?" అన్నాడు సాయంత్రం రాగానే ఆమెనిచూసి ఆశ్చర్యంగా కుశలప్రశ్నలువేసి.

"ఏం ? మా అక్క యింటికి నేను రాకూడదా ?" అంది రాధ కళ్ళు యెగరవేస్తూ.

"ఎందుకు రాకూడదు ? వెల్‌కమ్ !.... తెలిస్తే స్టేషనుకి వొచ్చి వుండేవాడిని కదా !" అన్నాడు విశ్వం.

"మీకు తీరిక యెక్కడ బావగారూ ! అక్క వొచ్చింది కదా ! చాల్లెండి" అంది రాధ.

అంటే జానకి రాధ రాకని గురించి తెలిసే తనకి చెప్పలేదన్నమాట. విశ్వం కొంచెం ఆశ్చర్యపడ్డాడు. కాని, జానకి చేసిన దానిలో ఎంచవలసిన తప్పు ఏమీలేదని సరిపెట్టుకున్నాడు. తన బంధువులని పిలిచే హక్కు ఆమెకి వుంది.

జానకి కాఫీ తెచ్చి ఇస్తూ, "రాధ సాయంత్రం వొచ్చింది" అంది.

"పలకరించాను."

ఎదురుగా కూర్చుంది జానకి.

"అది బి. ఏ. పాసయింది...." అంది.

"నాకు తెలుసును."

"చక్కటి పిల్ల...."

"అవును."

"బుద్ధిమంతురాలు."

"అలాగే అనిపిస్తుంది.

"తినడానికి లోటులేకపోయినా, దీనికి తగిన వాడిని తీసుకొచ్చే స్తోమత మా పిన్నివాళ్ళకి లేదు."

"ఫరవాలేదు.... ఆ మాత్రం వాళ్ళకి వుంది — రాధని చూశాక కట్నం ప్రసక్తి అంతగా రాదేమోననిపిస్తుంది."

జానకి సంతృప్తిగా నవ్వి, "మీకూ అలాగే అనిపిస్తుందా?" అంది.

అస్తమానమూ నిజం చెప్పనక్కరలేదని మనస్సులో అనుకుని, "అలాగే అనిపిస్తుంది మరి. రాధ కేమిటి తక్కువ?" అన్నాడు విశ్వం. రాధ మీద జానకికి ఎంత అభిమానమో అతనికి తెలుసును.

"గుడ్ !" అంది జానకి.

"ఏం?" అన్నాడు విశ్వం.

"ఏమీ లేదులెండి.... రేపు మీ కుమార్ వొస్తాడా?" అంది జానకి.

"వొస్తానన్నాడుగా! తప్పకుండా వొస్తాడు — మనకి కుదరదంటే చెప్పు — మరో వారం రమ్మంటాను" అన్నాడు విశ్వం.

"డోంట్ వర్రీ. రానివ్వండి.... చాలా సరదా అయిన మనిషి" అంది జానకి.

"అవును. పెళ్ళిమీద ఉపన్యాసం మొదలు పెట్టకపోతే అంత మంచివాడు లేడు" అన్నాడు విశ్వం- కిందటివారం జరిగినదంతా జ్ఞాపకం తెచ్చుకుని.

"మనలాటి సంసారాలు చూస్తే అతను మనసు మార్చుకుంటాడు" అంది జానకి.

విశ్వం నవ్వకుండా వుండలేకపోయాడు.

"ఏం ? అతనుండగా వేరేలాగ అనుకునేందుకు ఏం జరిగింది ?" అంది జానకి కొంచెం కోపంగా.

"ఏమీ జరగలేదు. ఒప్పుకుంటాను. కాని, మన సంసారం వున్నది వున్నట్టు చూస్తే అతనికి మరో వోటు పడినట్టే కదా !" అన్నాడు విశ్వం.



"అలాగచూసే ప్రమాదం లేదులెండి. మీరు కాస్త జాగ్రత్తగా వుంటేచాలు. అసలే మతిమరుపు మీకు" అంది జానకి.

కుమార్ ముందు వదువుపోడం విశ్వానికి ఇష్టంలేదు. జానకిలో శాశ్వతమైన మార్పు రాలేదన్న అనుమానం ఈ మాటలతో ధృవపడినా, మరో రెండు రోజులు చల్లటి సంసారం సాగించడానికి విశ్వం మనసారా అంగీకరించాడు. అలాగే చాలాకాలం కుమార్ తమ ఇంటికి రావాలనీ, తొందరపడి అతను ఏ నిర్ణయానికీ రాకూడదనీ అతను కోరుకున్నాడు.

మర్నాడు పదకొండు అవుతోంటే కుమార్ వచ్చాడు.

కుశలప్రశ్నలయ్యాక పదినిమిషాలాగి కాఫీ పంపింది జానకి రాధచేత. విశ్వం రాధని పరిచయం చేశాడు. చాలా రిహార్సిల్స్ చేసినట్టు రాధ బాగానే మాట్లాడింది. లాంఛనంగా ఆమెనీ కాఫీ తీసుకొమ్మన్న కుమార్ మాట కాదనకుండా అలాగేచేసి కొంతసేపు కూర్చుని వెళ్ళింది.

విశ్వానికి ఇదంతా చూడగానే గోరంత అనుమానం కలిగింది- కుమార్‌ని జాలిగా చూశాడు. జానకి మంచి ప్లానే వేసింది అనుకున్నాడు. ఆమె చర్యలూ, ప్రవర్తనా, రాధ ఇలాగ హఠాత్తుగా రావడమూ అన్నీ అర్థమయ్యాయి.

ఇది జరిగితే మంచిదేననిపించింది విశ్వానికి. చీకూ చింతా లేకుండా బ్రతికేస్తున్నాడు కుమార్. ఒంటరిగా వుంటేనేం. అతను మరీ స్వేచ్ఛగా వున్నాడు. ఆడపిల్లలవాళ్ళు అతన్ని తరచుగా పిలుస్తూనే ఉండాలి! పెళ్ళికి ముందు తనూ అలాగే చాలా హుషారుగా దర్జాగా తిరగడం గుర్తు తెచ్చుకుని విశ్వం ఎవరికీ వినిపించని నిట్టూర్పు విడిచాడు. ఈ చిన్న ప్లానులో జానకికి సహాయం చెయ్యాలనే నిర్ణయం వెంటనే తీసుకున్నాడు.

అందుకే ఏమి కావలసినా రాధనే పిలిచి చెప్పేడు.

"రాధ చాలా నైస్ గర్ల్, సింపుల్ లైఫ్. మంచి పుస్తకాలంటే ఇష్టం— ఇంటిపట్టున అంటిపెట్టుకుని వుంటుంది. మోడరన్ అమ్మాయిల్లాగ విచ్చలవిడిగా తిరగదు. అసలు వాళ్ళ ఇంట్లో సంప్రదాయమే అంత" ఇవన్నీ ఒక్కసారి చెప్పలేదు. సందర్భం దొరికినప్పుడు చాలా కాజువల్‌గా ఒక్కొక్కటే చెప్పి వెంటనే మరో విషయానికి మాటలని మళ్ళించేడు.

ఈ చర్యల ప్రభావం జానకి మీద అనుకోనంతగా కలిగింది.

సాయంత్రం కుమార్ వెళ్ళిపోయాక విశ్వం కాస్తసేపు నిద్రపోదామనుకున్నాడు. అవతలి గదిలో రాధ రేడియో పెట్టడాన్న నిద్ర రావడం కష్టమయింది. హఠాత్తుగా, పాట మధ్యలో రేడియో ఆగిపోయింది. "బావగారు నిద్రపోతున్నారు— గోలచేస్తే ఎలా?" అని జానకి రాధని మందలించింది. ఆ తరవాత రాధ ఏదో అంది. విశ్వానికి వినిపించలేదు. "నోరు మూసుకోవే" అని జానకి అనడం మాత్రం వినిపించింది. సాయంత్రం దాకా అతను నిద్రపోయాడు. టీకప్‌తో జానకి నిద్రలేపడం అతనికి పెళ్ళి అవగానే గడిచిన కొత్తరోజులని జ్ఞప్తికి తెచ్చాయి. "రాధ సరదాపడుతోంది — అలాగ తిరిగి వద్దామా" అని జానకి అడగడం కూడా అతనికి మరిచిపోయిన మరో అనుభవాన్ని కలుగచేసింది. అడిగే అలవాటు పోయింది ఆమెకి. చెప్పడం అలవాటు.

ఆ మర్నాడు కుమార్ మూడున్నరదాకా వాళ్ళింటిలోనే గడిపేడు.

అక్కడ జరిగినదంతా యెవరేనా రికార్డుచేస్తే ఆదర్శ దాంపత్యంమీద అద్భుతమైన స్క్రిప్టుగా పనికొచ్చి వుండేది. విశ్వం నిజానికి నటించలేదు. జానకి అతనిలో తెచ్చిన మార్పులోని బలంతో అతను సహజంగా ప్రవర్తించగలిగాడు. జానకి మాట చెప్పనే అక్కరలేదు. ఉత్తమ ఇల్లాలినోయీ అని ఆమెని చూసే రాసినట్టు వుంది ఆమె ప్రవర్తన. రాధకూడా అనుకోకుండా చాలా స్వీట్‌గా ప్రవర్తించింది. చిన్నచిన్న సిగ్గు దొంతరలు, తియ్యటి చిరునవ్వులు, తూచినట్టు ఆడిన మాటలు. ఆమెమీద కూడా విశ్వానికి అభిమానాన్ని కలిగించాయి.

వాటన్నిటికన్నా ఒకటి రెండుసార్లు కుమార్ అన్న మాటలు అక్కడ అందరికీ సంతోషం కలిగించాయి.

"ఇవేళ నాకు చాలా సంతోషంగా వుంది. ఫేమిలీస్ మధ్యకి పోవడంఅంటే భయం నాకు.... కాని మీ హేపీ ఫేమిలీ చూశాక నా ఉద్దేశాలన్నీ మార్చుకోవాలని అనిపిస్తోంది" అన్నాడు. జానకి చాలా సంతృప్తిగా నవ్వింది— విశ్వం కొంచెం గర్వపడ్డాడు. కాని ఈ హేపీనెస్ తాత్కాలికమే అని అనుకుని కొంచెం బాధపడ్డాడు. అలాగ కాకుండా ఏం చెయ్యాలోనని ఆలోచించే నిర్ణయం కూడా చేసుకున్నాడు. జానకి ముఖం వెలిగిపోయింది. అనవసరంగానే అయినా రాధ కూడా కాస్త లావణ్యం ఒలికించింది.

వెళ్ళడానికి లేచినప్పుడు కుమార్ అందరికీ ధన్యవాదాలు చెప్పేడు.

"రేపూ సెలవుకదా ! రండి.... మీ కంపెనీ మా అందరికీ చాలా బాగుంది" అంది జానకి.

## క్యాసెట్లు పూస్తాయి

పరచుకుంది నీ నరాల్లో
భయం ఎడారి.
ఇసకలో గుండె దడలను
పాతేసుకుంటూ
ఎన్నాళ్ళీ ఒంటరి ఒంటె సవారీ
ఎందు కొదిలివచ్చావు
సందుల్లో నోరెత్తే సందడిసంగీతాన్ని
ఎంత బాగుండేది
మధ్య మధ్య నీ ఊపిరిని మాలిష్‌చేసే
ఎండుచేపల తిరగమోత

ఏముంది ఈ ఎడారిలో,
దిక్కుల కత్తెరలో చిక్కి తెగిన
నక్కగారి ఊళ.
చావుకంపూ జబ్బువాసనా లేని
ఇసక పొరల ముక్కుల్లో మూల్గే
ముసలికాలం శ్వాస.
వెళ్ళిపో వెనక్కి.
కలిసిపో ఇరుకు వాడలను
కష్టాలు పడుతున్న జనంలోకి.
భయపడుతున్నావా

అక్కడున్నది రొచ్చని.
పిచ్చోడా పిరికోడా
రొచ్చుకు చిచ్చుంటుంది.
రోజాలు నీ కాళ్ళకింద మొలుస్తాయి.
నువ్వున్న సందుచెట్లకు
తిరుగుబాటు పాటల
సరికొత్త క్యాసెట్లు పూస్తాయి.

—డాక్టర్ సి. నారాయణరెడ్డి

"తప్పక వద్దామనేఉంది. కాని, నేను అర్జెంటుగా మా ఫాదర్‌ని కలుసుకోవాలి. ఈ రాత్రి బయలుదేరి హైదరాబాద్ వెళ్తున్నాను" అన్నారు కుమార్.

"అలాగా! అనుకోకుండా వెళ్తున్నారా!" అన్నాడు విశ్వం.

"ఒక విధంగా అవును" అన్నాడు కుమార్.

అందరూ అర్థం కానట్టు చూశారు.

కొంచెం సిగ్గుపడుతూ కుమార్ "ఇంత అభిమానం చూపుతున్న మీ దగ్గర దాచేది ఏమీ లేదులెండి.... ఫాదర్ నా మేరేజి గురించి చాలా కాలంనించి ప్రెషర్ చేస్తున్నారు. నేను వ్యతిరేకిస్తూ వొచ్చాను. నా ఉద్దేశాలు తెలుసుగా!"

ఎవరూ జవాబివ్వలేదు.

కష్టపడి చిరునవ్వులు మాత్రం నవ్వుతున్నారు.

"కిందటి వారం, ఈ రెండురోజులూ మిమ్మల్ని, మీ సంసారాన్ని చూశాక నా ఉద్దేశాలు మారిపోయాయి. యంగ్ లేడీస్ అంటే నాకు భయం. కారణాలు మీకూ తెలుసుగా! కాని మిస్ రాధని చూశాక వాళ్ళు ఇంత స్వీట్‌గా వుంటారని బోధపడింది. రాధగారికి చాలా థాంక్స్!"

రాధ ముఖం ట్యూబ్ లైటులాగ వెలిగింది. తల వొంచుకుని కళ్ళు దాచేసుకుంది ఆ అమ్మాయి.

జానకి హాయిగా చిరునవ్వు నవ్వింది. సక్సెస్, సక్సెస్ అనే నియాన్ లైట్లలాగ మెరుస్తున్నాయి ఆమె కళ్ళు.

కాని కుమార్ ఇంకా ఏదో చెప్తున్నారు.

"మా నైబర్‌గారి అమ్మాయి వుంది. వెరీ బ్యూటిఫుల్. ఆ అమ్మాయిని నాకివ్వాలని మా పెద్దవాళ్ళ ప్లాన్. రెండేళ్ళ నించి కాదంటున్నాను. నాలుగు రోజుల కిందట ఫాదర్ ఉత్తరం రాశారు. ఈ ఆదివారం వొచ్చి పద్మని విషయం — ఆ అమ్మాయి పేరు పద్మిని లెండి — సెటిల్ చేసుకుంటే సరి. లేకపోతే సోమవారం ఆ అమ్మాయికి మరో సంబంధం సెటిల్ చేస్తామన్నారు."

అందరూ కదలకుండా, నిశ్శబ్దంగా నిలబడ్డారు. ఎవరూ ఊపిరితియ్యటంలేదు. నియాన్‌లైట్లు ఆగిపోయాయి. సిగ్గులుచిందే చోట్లలో ఆత్రత నెమ్మదిగా నాట్యం చేస్తోంది.

"మీ ధర్మమా అని నాకు పెళ్ళిమీద, సంసారంమీద అభిప్రాయం మారిపోయింది! పద్మిని మీద భయం పోయింది. తనంటే నాకెంత ఇష్టమో తెలుసుకున్నాను....పూర్ స్వీట్ గర్ల్! రెండేళ్ళుగా నా కోసం ఎదురుచూసింది...."

కుమార్ ఆగిపోయాడు.

నిమిషం కష్టపడి గొంతుక సర్దుకుని, "కంగ్రాట్స్! వుయార్ సో హేపీ!" అన్నాడు విశ్వం.

"పద్మిని— అదృష్టవంతురాలు" అంది లోవాల్యూమ్‌లో జానకి.

రాధ ఏమీ అనలేదు.

"వెళ్ళొస్తానండీ....త్వరలో శుభలేఖ పట్టుకుని వొస్తాను. మీరందరూ రావాలి.... ఇది నా ఫస్ట్ ఇన్విటేషన్" అన్నాడు కుమార్. అతని ముఖంలో నియాన్‌లైట్లు, పున్నమి చందమామలు స్నేహంగా పోటీపడుతున్నాయి. అందరికీ మళ్ళీ వందనాలు చెప్పి కుమార్ వెళ్ళిపోయాడు

అందరూ నీరసంగా లోపలికి నడిచారు.

టీ తాగాలనిఉంది విశ్వానికి.... అడగడమా, వెళ్ళి తయారు చేసుకోవడమా అన్న ఆలోచనలో పడ్డాడు అతను.

జానకి నీరసంగా కుర్చీలో కూలబడి నొసలు రాసుకుంది.

రాధ రెండునిమిషాలు నిలబడి మరో గదిలోకి వెళ్ళిపడుకుంది.

"టీ తెస్తాను" అని లేచాడు విశ్వం ఆ చుట్టూ నిశ్శబ్దాన్ని భరించలేక. జానకి అభ్యంతరం చెప్పలేదు. ●





కాలిన గాయాలకు ప్రత్యేక చికిత్స

కాలిన గాయాల బాధే వేరు.
కాలిన గాయాలు చురుక్కుమంటూ నొప్పి పెడతాయి. కాలితే పొక్కులు లేస్తాయి. వాటికి కావలసింది గాయాలను మాన్పే మందు—బర్నాల్ యాంటిసెప్టిక్ క్రీమ్. బర్నాల్ చల్లదనాన్నిచ్చి వెంటనే ఉపశమనాన్నిస్తుంది. పొక్కులు లేవకుండా వెంటనే ఆపుతుంది. కాలిన గాయాలను త్వరగా మాన్పే మందు, బర్నాల్ యాంటిసెప్టిక్ క్రీమ్‌లో ఉంది.

ఎప్పుడూ బర్నాల్‌ని ఇంట్లో ఉంచుకోండి.




BC 5641

# బర్నాల్

కాలిన గాయాలకు ప్రత్యేక చికిత్స